# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 02 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




వివరాలు4వ పేజీలో

### వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు
## తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలి
### హడ్కో ఛైర్మెన్‌తో సీఎం రేవంత్ రెడ్డి



# వాయిదాల పర్వమే..

- సర్‌పై పార్లమెంట్‌లో ఆందోళన
- చర్చకు ప్రతిపక్షాలు పట్టు
- లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లిన విపక్ష ఎంపీలు
- సర్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- రాజ్యసభలో వాకౌట్
- ఆందోళన మధ్యే మణిపూర్ జీఎస్టీ బిల్లు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలి రోజే రెండు సభల్లో వాయిదాల పర్వం మొదలైంది. ఉదయం సమావేశం ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన ఐదుగురు మాజీ పార్లమెంట్ సభ్యులకు లోక్‌సభ శ్రద్ధాంజలి ఘటించింది. అనంతరం దేశానికి క్రీడా రంగంలో పురస్కారాలు తెచ్చిన మహిళా క్రీడాకారిణులకు సభ అభినందనలు తెలిపింది.

ఆ తరువాత ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ పై చర్చకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీనిపై కలకలం రేగడం తో సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తరువాత సమావేశం పునఃప్రారంభం కాగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు బిల్లులను ప్రవేశపెట్టారు. వీటిలో పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం మార్పులు, మణిపుర్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ బిల్లు, పాన్‌మసాలా తయారీపై కొత్త సెస్ విధించే బిల్లు ఉన్నాయి. దీనిపై విపక్షాలు బిగ్గరగా ఆందోళనలు చేపట్టడంతో లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు మరోసారి వాయిదా వేశారు.

సభ తిరిగి ప్రారంభం అయిన తర్వాత కూడా విపక్ష నినాదాలు కొనసాగడంతో ఉద్రిక్తత నెలకొంది. అల్లరి మధ్యే మణిపుర్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. నిరసనలు తగ్గకపోవడంతో లోక్‌సభను స్పీకర్ మంగళవారం వరకు వాయిదా వేశారు.

**రాజ్యసభ కూడా వాయిదా**

లోక్‌సభలోలా రాజ్యసభలో కూడా ఎస్ఐఆర్‌పై చర్చ నిర్వహించాలని విపక్షాలు పట్టుబట్టాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ ఎస్ఐఆర్‌పై చర్చ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమేనని, కానీ వెంటనే చర్చ నిర్వహించడం సరికాదని, తగిన సమయం కేటాయించి చర్చ అవశ్యమేనని విచారించారు. అయినా విపక్షాలు నిరసనలు కొనసాగించడంతో రాజ్యసభ కూడా మంగళవారానికి వాయిదా పడింది.

# అభివృద్ధిని అడ్డుకునే వారిని గెలిపించొద్దు

- పంచాయతీ ఎన్నికల్లో మంచోళ్లకు అవకాశమివ్వండి
- నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడమే కాకుండా వచ్చే రెండేళ్లలో ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలి
- కేసీఆర్ 8 లక్షల కోట్ల అప్పు చేసి పోయారు
- దశ-దిశ మారుస్తున్నాం.. దానికోసమే 'గ్లోబల్ సమ్మిట్'
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అభివృద్ధిని అడ్డుకునే వారిని స్థానిక సంస్థల్లో గెలిపించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీలు దేశంలో ఎంతమంది ఉన్నారనే లెక్క గత వందేళ్లుగా లేనప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సామాజిక కుల సర్వే ద్వారా అన్ని కులాల గణాంకాలు సేకరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మక్తల్ పట్టణ కేంద్రంలో జరిగిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుతో కొట్టుమిట్టాడిందని, ఒకవైపు ఆ అప్పులను తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధిని అడ్డుకునే వ్యక్తులను గెలిపించొద్దని, అలాంటి వారిని సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధి నిలిచిపోతుందని చెప్పారు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు తెచ్చే నాయకులనునే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని, ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి సూచించారు.

**పాలమూరు జిల్లాకు గతంలో నిర్లక్ష్యం**

పాలమూరు జిల్లాకు కరవు, వలసల ధోరణే పేరుగా మిగిలిందని, ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని రేవంత్ రెడ్డి విమర్శించారు. గతంలో ఏ నాయకుడూ పాలమూరుకు చేయూత ఇవ్వాలని ఆలోచించలేదని అన్నారు.ఇందుకే ఈసారి ఈ ప్రాంత ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి ప్రజా ప్రభుత్వానికి భారీ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మక్తల్‌లో విజయోత్సవ సభ నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఎత్తిపోతల పథకానికి ఊపు**

పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేశారని, ప్రాజెక్టుపై కేసులు వేయడం వలన పనులు నిలిచిపోయాయని అన్నారు.రైతులకు నష్టం జరగకుండా ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కృష్ణా నది ఈ ప్రాంతంలో ప్రవహిస్తున్నా ఇక్కడి నేలకు నీళ్లు అందకపోవడం దురదృష్టకరమని తెలిపారు. మాయగాళ్ల మాటలు నమ్మి అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని సూచించారు.

ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌ను ప్రభుత్వం ముఖ్య రంగాలుగా తీసుకున్నదని సీఎం తెలిపారు. వలసల కారణంగా విద్యకు దూరమైన పాలమూరు బిడ్డలకు నాణ్యమైన విద్య అందించే కృతనిశ్చయంతో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్టు చెప్పారు. ఉమ్మడి పాలమూరుకు ఐఐటీ మంజూరు చేసుకున్నామని, పాలమూరు యూనివర్సిటీలో అడిగిన కోర్సులన్నీ ఆమోదించినట్టు వెల్లడించారు.

ఒకప్పుడు మహిళలు ప్రయాణ ఛార్జీల కోసం ఇబ్బంది పడేవారని, ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణంతో సౌలభ్యం పెరిగిందని సీఎం చెప్పారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలను చూసి కొందరు కళ్లల్లో నిప్పులు కక్కుతున్నారని విమర్శించారు. పొదుపు సంఘాల మహిళలకు పెట్రోలు బంకుల యాజమాన్యాన్ని అప్పగించామని, హైటెక్ సిటీలో 150 క్యాంటీన్లను మహిళా సంఘాలకు కేటాయించినట్టు చెప్పారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని తెలిపారు.

మిగితా 4వ పేజీలో







## పార్లమెంట్‌లో డ్రామా వద్దు

- ప్రధాని మోదీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానుండగా, ముందుగానే విపక్షాలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కీలక సందేశం ఇచ్చారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని కొన్ని పార్టీలు ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి సెషన్‌ను సాఫీగా నడపాలని, దేశ ప్రయోజనాల కోసం బలమైన విధానాలు, చట్టాలు ఆమోదించే అవకాశాన్ని విపక్షాలు అడ్డుకోకూడదని సూచించారు.శీతాకాల సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడుతూ మోదీ, "పార్లమెంట్‌లో డ్రామా కాదు డెలివరీ జరగాల్సిన స్థలం ఇది" అని స్పష్టం చేశారు. "బిహార్ ఓటమి ఫ్రస్ట్రేషన్‌ను పార్లమెంట్‌కు తెచ్చొద్దు"

మిగితా 4వ పేజీలో

## సమస్యలను లేవనెత్తడం డ్రామా కాదు

- ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రతిస్పందన

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వద్రా తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడమే ప్రజాస్వామ్య వ్యవస్థ ఆత్మ అని పేర్కొన్నారు. "పార్లమెంట్‌లో మాట్లాడటం, సమస్యలు చెప్పడం డ్రామా కాదు. నిజమైన డ్రామా అంటే ప్రజాస్వామ్య చర్చలను అడ్డుకోవడం." అని ఆమె వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ), ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం వంటి అత్యవసర అంశాలు చర్చించకపోవడం ప్రజలకే అన్యాయం అవుతుందని ప్రియాంకా విమర్శించారు.

# పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

### మంత్రి తుమ్మల జోక్యంతో సీసీఐ-జిన్నింగ్ మిల్లుల వివాదానికి పరిష్కారం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో గత కొద్దిరోజులుగా సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మరియు జిన్నింగ్ మిల్లుల మధ్య ఉద్రిక్తత కారణంగా నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా జోక్యం చేసుకొని, సీసీఐ ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి నిబంధనల్లో మార్పులు చేయించారు.దీంతో రాష్ట్రవ్యాప్తంగా నోటిఫై చేసిన 330 జిన్నింగ్ మిల్లులు తిరిగి కొనుగోళ్లు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి.

సీసీఐ విధించిన కఠిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లుల యజమానులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. మిల్లులలో పత్తి నిల్వ, నాణ్యత పరీక్ష విధానాలపై ఉన్న వివాదంతో పత్తి కొనుగోళ్లు పూర్తిగా ఆగిపోయాయి. దీనివల్ల పత్తి రైతులు తమ పంటను అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో మార్కెట్‌లో గందరగోళం నెలకొని, రైతులపై ఆర్థిక భారం పెరిగింది.

**మంత్రి తుమ్మల కృషితో పరిష్కారం**

వివాద పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలు చర్చలు జరిపారు. సీసీఐ అధికారులతో సమావేశాలు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో చర్చలు, కేంద్ర మంత్రులు, సీసీఐ సీఎండీతో నేరుగా మాట్లాడటం, మిల్లుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల్లో మార్పులు చేయించడంతో సమస్య పూర్తిగా పరిష్కారమైంది.

ఇప్పటి వరకు సీసీఐ కేవలం 3.66 లక్షల టన్నుల పత్తినే కొనుగోలు చేయగలిగిందని మంత్రి తుమ్మల తెలిపారు "ఇకపై సీసీఐ%-%జిన్నింగ్ మిల్లులు సమన్వయంతో పనిచేసి, రైతుల వద్ద మిగిలిన మొత్తం పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం." రాష్ట్రవ్యాప్తంగా కొనుగోళ్లు పునఃప్రారంభం కావడంతో మార్కెట్ సందడిగా మారింది. రైతుల్లో పునరుత్సాహం నెలకొంది.





ప్రజా పాలన విజయోత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ జట్టుతో జరగబోయే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు సిద్ధంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఎంసీహెచ్‌ఆర్డీ గ్రౌండ్స్‌లో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

## తగ్గిన జీఎస్టీ వసూళ్లు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ జీడీపీ ఓ వైపు దూసుకుపోతోందని కేంద్ర గణాంకాల శాఖ ఇస్తోన్న రిపోర్టులకు జీఎస్టీ వసూళ్లకు పొంతన లేకుండా పోతోంది. ఈ ఏడాది నవంబర్‌లో దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు 0.7 శాతం తగ్గి రూ.1,70,276 కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. గతేడాది నవంబర్‌లో రూ.1.69 లక్షల కోట్ల పన్నులు వసూళ్లయ్యాయి. దేశీయంగా జీఎస్టీ రెవెన్యూ తగ్గడం ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది.

## మేడారం అభివృద్ధి పనుల్లో
# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. అధికారులు, ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని.. ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో సమీక్షించారు.

మేడారం అభివృద్ధిలో భాగంగా రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి ఉండే ప్రదేశాలు ఇలా ప్రతి ఒక్క అంశంపైనా ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు.పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి గారి సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని మరోసారి స్పష్టంగా చెప్పారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు గారు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గారు, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ గారు, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెండో దశ తొలి రోజు సర్పంచ్ నామినేషన్లు 2,975

- నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరి రోజు
- ఐదు గ్రామాల్లో సర్పంచ్ పోటీ లేదు
- మంచిర్యాలలో 3, ఆసీఫాబాద్, నిర్మల్ జిల్లాలో ఒక్కొక్కటి
- 133 వార్డులకు సైతం నామినేషన్లు నిల్
- సర్పంచ్ ఎన్నికల బరిలో 22,330 మంది అభ్యర్థులు
- నేడు మొదటి దశ అప్పీళ్లపై పరిశీలన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రెండో విడుత గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు మంద కొడిగా సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,332 సర్పంచ్ స్థానాలకు 2,975 నామినేషన్లు, 38,342 వార్డులకు 3,608 నామినేషన్లు దాఖలయ్యాయి. 187 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న సిద్దిపేటలో అత్యధికంగా 228, ఆ తర్వాత వికారాబాద్ జిల్లాల్లో 184 నామినేషన్లు వచ్చాయి. 117 స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్న వరంగల్ జిల్లాలో అత్యల్పంగా 32. ఆ తర్వాత ములుగు జిల్లాలో 18 నామినేషన్లు దాఖలయ్యాయి 1,540 వార్డు స్థానాలకు రెండో విడుతలో ఎన్నికలు జరగుతున్న రంగారెడ్డి జిల్లాలో 316, ఆ తర్వాత సిద్దిపేట జిల్లాలో 218 నామినేషన్లు వచ్చాయి. అత్యల్పంగా మలుగులో 24, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో 28 నామినేషన్లు వచ్చినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. కాగా రెండో రోజు నామినేషన్ల వివరాలను మంగళవారం ప్రకటించనున్నట్టు ఎన్నికల సంఘం పేర్కొంది.

రాష్ట్రంలో తొలి దశలో ఎన్నికలు జరుగుతున్న 4,236 పంచాయతీల్లో 5 గ్రామాలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. నవంబర్ 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నామినేషన్లకు అవకాశం కల్పించినా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఒక్కరు కూడా దాఖలు కాని ఆ గ్రామాలు ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు చెందినవే కావడం గమనార్హం. మంచిర్యాల జిల్లాలో 3, ఆసీఫాబాద్, నిర్మల్ జిల్లాలో ఒక్కో గ్రామంలో పోటీకి అభ్యర్థులెవరూ ముందుకు రాలేదు. స్థానిక సమస్యలు తీర్చాలనీ, తమ గ్రామాన్ని నిర్లక్ష్యం చేశారని తదితర కారణాలతో ఆయా గ్రామాలు

ఎన్నికలు దూరంగా ఉన్నట్టు సమాచారం. అలాగే 37,440 వార్డులకు గాను 133 వార్డులో కూడా ఎవరూ పోటీకి ఆసక్తి చూపక పోవడంతో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఈసీ తెలిపింది. అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 34 వార్డుల్లో, ఆ తర్వాత ఆసీఫాబాద్ జిల్లాలో30 వార్డుల్లో నామినేషన్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దాఖలైన మొత్తం నామినేషన్ల పరిశీలన అనంతరం సర్పంచ్ స్థానాలకు 22,330 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 85,428 మంది బరిలో నిలిచి నట్టు తెలిపారు. నేడు అప్పీళ్ల పరిశీలన, బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది.





## జీహెచ్‌ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ ఆమోదం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపాల్టీల చట్టాల సవరణ ఆర్డినెన్స్‌లకు సోమవారం ఆయన ఆమోదముద్ర వేశారు. జీహెచ్‌ఎంసీలో 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను విలీనం చేయాలని ఈనెల 25న

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఆర్డినెన్స్‌లను గవర్నర్ ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌లను గవర్నర్ ఆమోదించారు. జీహెచ్‌ఎంసీలో కలిపిన 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు సంబంధించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని నగర పాలక మున్సిపల్ కార్పొరేషన్లు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, మున్సిపాల్టీలు దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లు బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్, మున్సిపాల్టీలు పెద్ద అంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిభట్ల, జల్‌పల్లి, శంషాబాద్, మణికొండ, తుక్కుగూడ, నార్సింగి, సంగారెడ్డి జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలు ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ ఉన్నాయి.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

**సీఎస్ రామకృష్ణారావు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8, 9 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరె న్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సబ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సమ్మిట్‌లో పాల్గొనే ప్రముఖులకు, దేశ, విదేశీ అతిథులకు ఆహ్వానాలు పంపుతున్నట్టు తెలిపారు. సమ్మిట్‌కు హాజరయ్యే వారికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లపై ప్రత్యేకం గా ప్రజా భవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నిర్వహిచే అతిపెద్ద సమ్మిట్‌లో రాష్ట్రానికి చెందిన అన్నిశాఖ లు తమ పురోగతిని షో కేస్ చేయాలన్నారు. ప్రధానంగా ప్లీనరీ, ముఖ్యమంత్రి వన్ టు వన్ సమావేశాలు, వివిధ సంస్థలతో ఎంఓయూ ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 13 వరకు ఈ సమ్మిట్ కొనసాగుతుందనీ, అదే రోజు ఉప్పల్ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్‌తో ముగుస్తుందని వెల్లడించారు.

## మహిళా సంఘాలకు 448 అద్దె బస్సులు కేటాయింపు

- మంత్రులు సీతక్క, పొన్నం సంయుక్త ప్రకటన

వివరాలు 4వ పేజీలో

## తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు..

### శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర విషయంలో వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశం

వివరాలు 2వ పేజీలో

# తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు..

**శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర విషయంలో వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 1342 ప్రకారం పలువురు ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) క్యాడర్లో హోదా కల్పించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఐపీఎస్ అధికారులైన శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర లాంటి వారిని ఐఏఎస్ క్యాడర్లో ఎందుకు కొనసాగిస్తున్నారో వివరణ ఇవ్వాలని కోర్టు చీఫ్ సెక్రటరీని ఆదేశించింది.

తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 26వ తేదీన విడుదల చేసిన జీవో 1342 చట్టవిరుద్ధమని పేర్కొంటూ వడ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ గోపాల్ ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద, జీవో 1342పై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (చీఫ్ సెక్రటరీకి) నోటీసులు జారీ చేశారు. ఈ అంశంపై డిసెంబర్ 10వ తేదీ లోపు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

# సర్పంచ్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలి

**నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి అనుముల భాస్కర్**



**బలగం, బోయినిపల్లి**

సర్పంచ్ ఎన్నికల్లో నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి అనుముల భాస్కర్ కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామస్తులతో, పెద్దలతో కలిసి కొదురుపాక గ్రామపంచాయతీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. అనంతరం వార్డు సభ్యులతో కలిసి అనుముల భాస్కర్ నామినేషన్ వేశారు.

ఈ సందర్భంగా అనుముల భాస్కర్ మాట్లాడుతూ: నీలోజిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని, ఈ సర్పంచ్ ఎన్నికల్లో తనని గెలిపిస్తే అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధి ధ్యేయంగ పని చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, గ్రామాన్ని తీర్చిదిద్దుకున్నామని అన్నారు

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- **దేశాయిపల్లి సర్పంచ్ అభ్యర్థి నిమ్మ భాగ్యలక్ష్మీ-శ్రీనివాస్ రెడ్డి**

**బలగం, బోయినిపల్లి**

గ్రామ ప్రజల ఆశీర్వాదంతో గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వస్తున్నట్లు దేశాయిపల్లి సర్పంచ్ అభ్యర్థి నిమ్మ భాగ్యలక్ష్మీ-శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నిమ్మ భాగ్యలక్ష్మీ-శ్రీనివాస్ రెడ్డి గ్రామస్తులతో కలిసి బోయినిపల్లి మండల కేంద్రానికి ర్యాలీగా గ్రామ ప్రజల మద్దతుతో తరలివచ్చి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిమ్మ భాగ్యలక్ష్మి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ: గత 30 సంవత్సరాలలో గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకున్నట్లు తెలిపారు. మరోసారి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా



తీర్చిదిద్దేందుకు మళ్లీ గ్రామస్తుల సహకారంతో ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14న జరిగే పోలింగ్ లో దేశాయిపల్లి గ్రామ ప్రజలు గెలిపించగలరని ప్రార్థించారు.

# సామాజిక అసమానతలపై ధిక్కార స్వరం ఈశ్వరీ భాయ్



**బలగం, హైదరాబాద్**

ఈశ్వరీ భాయ్ వ్యక్తి కాదు మహా శక్తి అని శాసన సభ సభా పతి గడ్డం ప్రసాద్ రావు అభివర్ణించారు. సామాజిక అసమానతలపై ధిక్కార స్వరం ఈశ్వరి భాయ్ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ఈశ్వరీ భాయ్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహణలో ఈశ్వరి బాయి 107 వ జయంతి సందర్భంగా ఆమె పేరిట ఏర్పాటు చేసిన పురస్కారం పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్కకు ప్రదానోత్సవం సభ జరిగింది ప్రసాద రావు పాల్గొని గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తో కలిసి సీతక్క కు పురస్కారం బహుకరించి మాట్లాడారు. ఈశ్వరీ భాయ్ అంబే ద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితుల హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అన్నారు. సామాజిక న్యాయం ధ్యేయంగా ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. మహిళలు ఈశ్వరీ భాయ్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాలలోకి ఎక్కువ మంది రావాలని సూచిం చారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నాడు ఈశ్వరీ భాయ్ ఫైర్ బ్రాండ్‌గా అసెంబ్లీ లో పేరు తెచ్చుకు న్నారని, ప్రస్తుతం సీతక్క ఆ గుర్తింపు పొందారని అభినందించారు. మహిళా సాధికారత కు సీతక్క నమూనా అన్నారు. పురస్కారం అందుకున్న సీతక్క మాట్లాడుతూ ఈశ్వరీ భాయ్‌కి , దళిత బహుజ నులకు అంబేద్కర్ ఆదర్శం అన్నారు. ఆయన అందించ న రాజ్యాంగం కారణం గానే అడవి బాట పట్టిన తాము విద్యావంతులై ప్రజా జీవితానికి వచ్చి ప్రజా ప్రతినిధి అయ్యానని చెప్పారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను కాదు దేవుడిని నమ్మమనీ చెప్పారని, ఎవరూ బలవంతంగా ఎవరినీ ఒప్పించ ˘లేరన్నారు. అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. ట్రస్ట్ స్థాపకురాలు డాక్టర్ గీతా రెడ్డి అధ్యక్షత వహించిన వేదిక పై ప్రొఫెసర్ స్వామి, దళిత ఉద్యమ నాయకుడు జేబీ రాజు, కార్పొరేటర్ విజయ రెడ్డి, సంగీత నాటక అకాడమీ చైర్మెన్ అలేఖ్య, నిర్మలా జగ్గా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యా త సుజాత ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పంపిన సందేశం చదివారు

# సర్పంచ్ పదవికి వేలంపాట.. రూ.73 లక్షలకు ఏకగ్రీవం..!

**బలగం టీవీ, నల్గొండ**



నల్గొండ జిల్లా, చండూరు మండలం పరిధిలోని బంగారిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి ఎన్నికల సందర్భంగా ఊహించని పరిణామం చోటుచేసుకుంది. గ్రామాభివృద్ధి, కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు గాను, ఏకంగా వేలంపాట నిర్వహించారు.

సర్పంచ్ పదవికి మొత్తం 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామ నిర్ణయం గ్రామాభివృద్ధి ధ్యేయంగా, గ్రామంలోని కనకదుర్గ ఆలయ నిర్మాణం కోసం సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేయాలని గ్రామ పెద్దలు, అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయంలో భాగంగా సర్పంచ్ పదవికి వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో పాల్గొన్న అభ్యర్థులు గ్రామ అభివృద్ధి కోసం తాము ఎంత ఖర్చు చేస్తారో ప్రకటించారు. విజేతగా మహమ్మద్ సమీనా ఖాసీం అనే అభ్యర్థి అత్యధికంగా రూ.73 లక్షలు చెల్లించి గ్రామ అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇవ్వడంతో, సర్పంచ్ పదవిని ఆమె దక్కించుకున్నారు. ఏకగ్రీవం దీనికి అంగీకరిస్తూ, పోటీలో ఉన్న మిగతా అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటామని ఒక ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. దీంతో బంగారిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలుస్తోంది. ఈ ఏకగ్రీవంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



# ప్రేమజంటను కలిపిన సర్పంచ్ ఎన్నికలు..

- **రాత్రికి రాత్రే పెళ్లి చేసుకుని నామినేషన్ ఉపసంహరించుకోని వధువు!**

**బలగం టీవీ, సంగారెడ్డి**

ఎన్నికలు సాధారణంగా రాజకీయ వైరుధ్యాలకు దారి తీస్తాయి, కానీ సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలు మాత్రం అరుదైన రీతిలో ఒక ప్రేమజంటను ఒక్కటి చేశాయి. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ స్థానం ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో, అదే గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అనే యువకుడు తన ప్రేయసి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్రీజను సర్పంచ్ అభ్యర్థిగా పోటీకి నిలబెట్టాలని నిర్ణయించుకున్నాడు. దాని ప్రకారం శ్రీజ నామినేషన్ కూడా దాఖలు చేసింది. తమ కూతురు ఎన్నికల్లో పోటీ చేయడం శ్రీజ తల్లిదండ్రులకు ఇష్టం లేదు. దీంతో వారు శ్రీజపై ఒత్తిడి తెచ్చి నామినేషన్ ఉపసంహరించుకోవాలని కోరారు. వారి నిర్ణయాన్ని వ్యతిరేకించిన ప్రేమజంట, తల్లిదండ్రులు అడ్డుకునే అవకాశం ఇవ్వకుండా రాత్రికి రాత్రే చారిత్రక యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత శ్రీజ మాట్లాడుతూ.. తాను మేజర్ అని, తన ఇష్టంతోనే చంద్రశేఖర్‌ను పెళ్లి చేసుకున్నానని స్పష్టం చేసింది. తమను ఎవరూ ఇబ్బంది పెట్టొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా, తన భర్త చంద్రశేఖర్ గౌడ్ సహకారంతో సర్పంచ్ ఎన్నికల్లో గెలుస్తానని ధీమా వ్యక్తం చేసింది. ఇప్పుడు గ్రామ ప్రజలు తనకు మద్దతు ఇస్తే, భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి కష్టపడతానని హామీ ఇచ్చింది. ప్రేమించి, కష్టపడి ఒక్కటైన శ్రీజ, చంద్రశేఖర్ గౌడ్ జంటకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు.

# ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కలకలం..

- **విజయనగరంలో మహిళ మృతి**
- **1317 పాజిటివ్ కేసులు నమోదు!**

**బలగం టీవీ, విశాఖపట్నం**





ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' అనే కొత్త పురుగు వ్యాధి కలకలం సృష్టిస్తోంది. ఈ కీటకం కుట్టడం వల్ల అనారోగ్యానికి గురైన విజయనగరం జిల్లాకు చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందడంతో రాష్ట్ర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లి మండలం, మిట్టపల్లి గ్రామానికి చెందిన 36 ఏళ్ల రాజేశ్వరి గత కొంతకాలంగా జ్వరంతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా, ఆమెకు 'స్క్రబ్ టైఫస్' సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.

వైద్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఇది అంటువ్యాధి కాదు.. ఏపీలో ఇప్పటివరకు మొత్తం 1317 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వ్యాపిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరులో 379, కాకినాడలో 141, విశాఖపట్నంలో 123, వైఎస్సార్ కడపలో 94, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులో 86, అనంతపురంలో 68, తిరుపతిలో 64, విజయనగరంలో 59, కర్నూలులో 42, అనకాపల్లిలో 41, శ్రీకాకుళంలో 34, అన్నమయ్యలో 32, గుంటూరులో 31, నంద్యాలలో 30 కేసులు నమోదైనట్లు తెలిపిన వైద్య శాఖ. వ్యాధి నిర్ధారణ జరిగితే సాధారణ యాంటిబయాటిక్స్ తో ఈ వ్యాధి నయం అవుతుందని, అస్వస్థతకు గురవ్వగానే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు..

- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

**బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం..**

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 27 ఫిర్యాదులు స్వీకరణ.**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 27 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# నిక్కచ్చిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు..

- **సర్పంచ్ ఎన్నికలలో ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తప్పవు..**
- **స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి..**
- **సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కఠినంగా అమలు చేయడంతో పాటు, ప్రలోభాలను నివారించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో అభ్యర్థులు,వారి అనుచరులు డబ్బు పంచడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, కుల సంఘాలకు డబ్బు పంచడం, గ్రామ అభివృద్ధి పేరుతో డబ్బులు అడగడం, ఆశాచూపడం వంటి చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలు భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, మండలాల వారిగా ఎఫ్ఎస్టీ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.

**జిల్లెళ్ల చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసిన సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.**



గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా తంగాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఆదివారం రోజు ఆకస్మిక తనిఖీ చేసి వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించడంతో పాటు, వాహనాలను క్షుణ్ణముగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బీజేపీకి ఓటు వేస్తే 'మన మొలదారంతో మనమే ఉరి వేసుకున్నట్టే'




- **బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారత రాష్ట్ర సమితి సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్ బీజేపీ జిల్లా నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో కేటీఆర్ గారిని విమర్శించిన జిల్లా బీజేపీ నాయకులపై ప్రెస్‌మీట్ నిర్వహించి, సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బీజేపీకి ఓటు వేయడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా సుంకపాక మనోజ్ మాట్లాడుతూ.. బీజేపీని నమ్మి ఈ సర్పంచ్ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసినా, బలపరిచినా మన మొలదారంతో మనము ఉరి వేసుకున్న వాళ్ళం అవుతామని తెలియజేస్తున్నాని అన్నారు. కరీంనగర్ ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటి, పార్లమెంట్‌ను దడదడలాడిస్తూ వేలాది కోట్ల రూపాయల నిధులు తెస్తున్న బండి సంజయ్, సర్పంచ్ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపిస్తే 20 లక్షల రూపాయలు ఇస్తానని చెప్పడంపై మనోజ్ కుమార్ ప్రశ్నించారు.

గతంలో GHMC ఎన్నికల సమయంలో వరదల్లో బండి పోతే బండి ఇస్తానని, దానికి ఇన్సూరెన్స్ డబ్బులతో కొనిస్తామని అజ్ఞానంతో మాట్లాడిన వ్యక్తి బండి సంజయ్ అని విమర్శించారు. తెలంగాణలో గ్రామాల అభివృద్ధి ఏ పార్టీతో, ఏ నాయకుడితో జరిగిందో ఆలోచించి విజ్ఞతతో ఓటు వేయాలని ప్రజలను కోరారు. కొత్తగా కాంగ్రెస్ నాయకులు కూడా ఏకగ్రీవ సర్పంచ్‌లకు 10 లక్షలు ఇస్తామని చెబుతున్నారని, ఏకగ్రీవంగా ఎన్నికైన ఇతర పార్టీ అభ్యర్థులకు కూడా ఈ నిధులు ఇస్తారా లేక "మాకేం సంబంధం లేదన్నట్టు" వ్యవహరిస్తారా అన్నది ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాలను అభివృద్ధి చేసేది కేంద్రం అని మాట్లాడిన జిల్లా బీజేపీ నాయకులు.. తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి దాదాపు రెండు సంవత్సరాలు అయిన ఈ కాలంలో ఎన్ని నిధులు కేటాయించారో చెప్పే దమ్ము, ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేసిన పాపానికి ఈ రోజున తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి నుండి అదోగతి స్థితిలోకి వెళ్ళిందని ఆరోపించారు. జిల్లా బీజేపీ నాయకులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని సమస్యలపై నిలదీయకుండా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం చూస్తుంటే, వారిద్దరి పొత్తు ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలని కోరారు.

కేటీఆర్ నియోజకవర్గం వదిలి రాష్ట్ర రాజకీయాలపై తిరుగుతున్నారు అని విమర్శించిన బీజేపీ నాయకులకు బదులిస్తూ.. కేటీఆర్ రాష్ట్ర స్థాయి కాదు ప్రపంచ స్థాయి నాయకుడు. తన ఆలోచనలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన నాయకుడు. మీ లాగా గల్లీ లీడర్ కాదు. పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం వస్తే 'పాస్' అని తప్పించుకునే లీడర్ కాదని, కేటీఆర్ ని విమర్శించే స్థాయి, అర్హత బీజేపీ నాయకులకు లేదన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. తెలివి ఉంటే తమ నాయకుడు, ప్రస్తుత హోం శాఖ సహాయ మంత్రి ద్వారా కరీంనగర్ పార్లమెంట్‌కు నిధులు తెచ్చే పనులు చేయాలని, అంతే కానీ పెద్ద నాయకున్ని విమర్శిస్తే పెద్దోన్ని అయితాం అనే ఆలోచన నుండి బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రెస్‌మీట్ కార్యక్రమంలో మునీర్, షాదబ్, మన్సూర్, పవన్ కోడం, వెంకటేష్, తబ్రీజ్ తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో 'బాలామతి యక్షగానం' ఆవిష్కరణ

- **సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో అష్టావధాని తీగుళ్ల శ్రీహరి శర్మ చేతుల మీదుగా గ్రంథావిష్కరణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో రచయిత గూడూరి బాలరాజు రచించిన 'బాలామతి యక్షగానం' గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా గ్రంథాలయంలో అత్యంత ఘనంగా జరిగింది.బాలామతి యక్షగానం రా రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరణ రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ కార్య నిర్వహణలో బాలామతి యక్షగానం గ్రంథం అష్టావధాని సాహితీవేత్త తీగుళ్ల శ్రీహరి శర్మ చేతుల మీదుగా ఆవిష్కరణ జిల్లా గ్రంథాలయంలో ఉదయం 11:30 గంటలకు జిల్లా గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షుని తొలి పలుకులలో సాహిత్యంలో నాటకం, యక్షగానం, బుర్రకథ, ఒగ్గు కథ మొదలైన ప్రక్రియలో యక్షగానం గొప్ప సంగీత సాహిత్య సమ్మేళనతో కూడినది ఒకప్పుడు సినిమాలు లేని సమయంలో భారత రామాయణ గ్రంథాల సారాన్ని సామాన్య ప్రజలకు ప్రచారం చేసేది ఈ ప్రక్రియల ద్వారా అనేది లోక విదితం. సినిమాల ద్వారా ఇప్పుడు సాంఘిక సమాచారమే ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యఅతిథిగా అష్టావధాని తీగుళ్ల శ్రీహరి శర్మ పాల్గొని ఒకప్పుడు యక్షగానాలు నాటకాలు బుర్రకథలు వేసి రామాయణ భారతాల లో అందరి ఈ అర్థమయ్యే రీతిలో నైతిక విలువలను చెప్పేవాళ్లు అలాంటి కథ ఇప్పుడు కూడా రాస్తున్నందు కు ముదావహమన్నారు. పురాతన యక్షగానం కాల్పనిక కథతో ప్రారంభం చక్కని గూడూరి బాలరాజు చేసిన ప్రయత్నం అన్నారు.

శరత్ సాహితీ అధ్యక్షులు సబ్బని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. యక్షగానం కథ కాల్పనిక మైన చక్కని చిత్రీకరణతో చిత్రీకరించడం నాటకంగా కొన సాగిందన్నారు. పుస్తకం ఆది నుంచి అచ్చుయ్యేంతవరకు చూసి మాట రాసి తెలుగు యూనివర్సిటీకి అప్లై చేయించి సహకరించాను అన్నారు. సంకె పెళ్లి నాగేంద్ర శర్మ గారు జానపద సాహిత్యంలో సిరిసిల్ల ప్రాంతంలో ఎందరో కవులు ఉన్నారని అన్నారు డాక్టర్ జనాపాల జానపద సాహిత్యంలోనే పిహెచ్డి చేశారు అదేవిధంగా ఇక్కడ దూడ%శీ% నాంపల్లి మొదలైన వారు అనేక కవులు ఉన్నారన్నారు. బాలామతి యక్షగానం కాల్పగినకమైన చక్కని పాత్రలకు చిత్రీకరించారు అన్నారు. చక్కగా సమీక్ష చేశారు. గూడూరు బాలరాజు కొడుకు గూడూరు శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు, రచయిత గూడూరు బాలరాజును ఘనంగా సత్కరించారు. సహాధ్యక్షులు కోడం నారాయణ మాట్లాడుతూ ఎందరో కౌరకు నిలయమైనది సాహితీ సమితి అన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కుల రాజేశం , మాదిరెడ్డి అంజనాదేవి, కొలిపాక శోభారాణి, ముడారి సాయి మహేష్,బూర దేవానందం, వంశీకృష్ణ, సింగిరెడ్డి రాజిరెడ్డి, పని లక్ష్మణ్, గణేష్, రాజ ప్రకాష్, ఇంకెందరో కవులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# 'గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరం కొప్పుల లావణ్య-నగేష్ ను గెలిపించుకుంటాం'

**బలగం, బోయినిపల్లిబీ**

గుండన్నపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కొప్పుల లావణ్య – నగేష్ ను గ్రామస్తులందరం గెలిపించుకుంటామని గ్రామస్తులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం గుండన్నపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కొప్పుల లావణ్య–నగేష్ ను స్తంభంపల్లిలో నామినేషన్ వేయడానికి రాగా, భారీ సంఖ్యలో గ్రామస్తులు డోలు కళాకారుల, విన్యాసాల మధ్య ర్యాలీగా తరలి వెళ్లారు. నామినేషన్ వేసేందుకు కొప్పుల లావణ్య నగేష్ లు గ్రామస్తుల భారీ మద్దతు మధ్య స్థంభంపల్లికి చేరుకొని, నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ: గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరం కొప్పుల లావణ్య నగేష్ లకు మద్దతు తెలుపుతున్నట్టు తెలిపారు ఈనెల 14న జరిగే ఎన్నికల్లో ఏకతాటిపై ఓట్లు వేసి గెలిపించుకుంటామని తెలిపారు.

### వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు

# తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలి

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు హౌజింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (హడ్కో) ఛైర్మన్ శ్రీ సంజయ్ కులశ్రేష్ఠ గారిని కోరారు. హైదరాబాద్‌కు వచ్చిన కలశ్రేష్ఠ గారు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు కోరారు.

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరు, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణాలపై చర్చించారు. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్షన్) అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి గారు హడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకురాగా, వారు సానుకూలంగా స్పందించారు.సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో ఛైర్మన్ తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని కులశ్రేష్ఠ గారు సానుకూలంగా స్పందించారు.

ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఈ సందర్భంగా హడ్కో ఛైర్మన్‌ను ఆహ్వానించారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకునే వారిని గెలిపించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గత పదేండ్లుగా నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట్ – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడమే కాకుండా వచ్చే రెండేళ్లలో ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలని సంకల్పించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

ముందుగా శ్రీ శ్రీ శ్రీ పడమటి ఆంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆ తర్వాత నియోజకవర్గంలోని మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 118.82 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ , కోమటిరెడ్డి వెంకటరెడ్డి , జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. దశాబ్దాల కాలంగా పాలమూరు జిల్లా వెనుకబాటు అంశాలను ముఖ్యమంత్రి గారు ప్రస్తావించారు. పాలమూరు జిల్లాలో పాడిపంటలు పండాలన్న లక్ష్యంతో దశాబ్ద కాలంగా పాతాళానికి తొక్కివేయబడిన జీవో 69 ను బయటకు తీయడమే కాకుండా నారాయణపేట్– కొడంగల్ ఎత్తిపోతల పనులను మొదలు పెట్టబోతున్నట్టు తెలిపారు.

సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపించడానికి నిరంతరం పనిచేశాం. ప్రజా ప్రభుత్వం రైతుల కోసం 1.04 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించాం. ఉన్న కష్టాలను అధిగమిస్తూ, అప్పులు చెల్లించుకుంటూ వేల కోట్ల రూపాయలతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం..” అని అన్నారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన వివిధ అభివృద్ధి పనుల కోసం వివరాలు:

# మహిళా సంఘాలకు 448 అద్దె బస్సులు కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించడానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తం గా 152 ఆర్టీసీ అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో మరో 448 అద్దె బస్సులను మహిళా సంఘాలకే అప్పగించేందుకు ప్రక్రియ చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి లేఖ రాశారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తిచేసి, వాటిని ఆర్టీసీకీ అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలియజేశారు. అవస రమైన అనుమతులు మంజూరైన వెంటనే, ఆ బస్సులను ఆర్టీసీ అప్పగించనున్నట్టు పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఆర్టీసీలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తోంది. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభించడం, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలకంగా మారింది. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల విజయవంతమైన నిర్వహణను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిం ది. ఈ మహిళా సాధికారతకు దోహదపడే కీలక నిర్ణయం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా స్వయం సహా యక సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడటమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రత్యక్ష భాగస్వాములుగా మారడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ నిర్ణయం మహిళలకు నిరంతర, స్థిరమైన ఆదాయ మార్గాలను సష్టించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల నిబద్ధత, క్రమశిక్షణ రాష్ట్ర ప్రజా రవాణా రంగానికి కొత్త దిశను చూపుతుందన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇద్దరు మంత్రులు స్పష్టం చేశారు. మహిళలు స్వయం సమృద్ధిని సాధించి, రాష్ట్రాభివృద్ధిలో మరింత భాగస్వామ్యం అవడం ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

# పెండ్లి చేసుకున్న సమంత-రాజ్ నిడిమోరు



**బలగం టీవీ, హైదరాబాద్**

అగ్ర కథానాయిక సమంత రూత్ ప్రభు మరోసారి వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె వివాహం సోమవారం ఉదయం కోయంబత్తూర్‌లోని ఈశా ఫౌండేషన్ లింగ భైరవి ఆలయంలో నిరాడంబరంగా జరిగింది. అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో వధువు సమంత ఎరుపు రంగు చీరలో మెరిసిపోయారు. అనంతరం ఆమె పెళ్లి ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

ఈశా ఫౌండేషన్ ప్రకారం, సమంత–రాజ్ వివాహం ప్రత్యేకమైన భూత శుద్ధి సంప్రదాయం ప్రకారం జరిగింది. పంచభూతాలను శుద్ధి చేసి దంపతుల మధ్య భావోద్వేగ, ఆధ్యాత్మిక, మానసిక అనుబంధాన్ని బలపరచే విధంగానే ఈ విధానం రూపుదిద్దుకున్నదని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

‘ఫ్యామిలీమెన్–2’ సిరీస్‌లో సమంత నటించిన సమయంలోనే దర్శకుడు రాజ్%–%డీకే ద్వయంతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అదే సాన్నిహిత్యం తర్వాత ప్రేమగా మారి, ఇద్దరూ కలిసి అనేక సార్లు పబ్లిక్‌లో కనిపించడం, సమంత సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటోలువారి రిలేషన్‌పై ఊహాగానాలకు బలం చేకూర్చాయి. సమంత నిర్మించిన ‘శుభం’ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా రాజ్ వ్యవహరించడం కూడా వారి దూరాన్ని తగ్గించింది. చివరకు ఈ జంట వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

# పార్లమెంట్‌లో డ్రామా వద్దు

(మొదటి పేజీ తరువాయి)

“బిహార్ ఎన్నికల ఫలితాలపై ఫ్రస్ట్రేషన్‌ను పార్లమెంట్ వేదికగా వ్యక్తం చేయొద్దు. ఓటమితో అలుముకున్న నెగెటివిటీని ప్రజాస్వామ్య వేదికలోకి రావద్దు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన, సముచితమైన అంశాలపైనే చర్చ జరగాలి. గెలుపు అహంభావాన్ని ప్రదర్శించే వేదిక పార్లమెంట్ కాదు. “దేశ నిర్మాణం కోసం పాజిటివ్ థింకింగ్ అవసరం. అధికార–విపక్షాలు కలిసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి.” అని ప్రధాని అన్నారు.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, జాతీయ వ్యూహాల రూపకల్పన, చట్టసభల పనితీరు వంటి కీలక అంశాలపై విపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని ప్రధాని కోరారు. వికసిత భారత్ దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోందని, ప్రతిపక్షాల సహకారం అవసరమని వెల్లడించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వద్రా తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడమే ప్రజాస్వామ్య వ్యవస్థ ఆత్మ అని పేర్కొన్నారు. “పార్లమెంట్‌లో మాట్లాడటం, సమస్యలు చెప్పడం డ్రామా కాదు. నిజమైన డ్రామా అంటే ప్రజాస్వామ్య చర్చలను అడ్డుకోవడం.” అని ఆమె వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ), ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం వంటి అత్యవసర అంశాలు చర్చించకపోవడం ప్రజలకే అన్యాయం అవుతుందని ప్రియాంకా విమర్శించారు.


# గంభీర్, అగార్కర్‌లతో బీసీసీఐ అత్యవసర సమావేశం..!

**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ మధ్యలోనే టీమ్‌ఇండియాలో నెలకొన్న అంతర్గత ఉద్రిక్తతలపై బీసీసీఐ అత్యవసర చర్యలకు దిగింది. హెడ్ కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌లతో బుధవారం రాయ్‌పూర్‌లో కీలక సమావేశం ఏర్పాటు చేసినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. రెండో వన్డే ముందు జరుగుతున్న ఈ మీటింగ్ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవల ఏడాది వ్యవధిలో భారత టెస్టు జట్టుకు వరుస వైట్‌వాష్‌లు ఎదురవడం, డ్రెస్సింగ్‌రూమ్‌లో విభేదాలు, ముఖ్యంగా సీనియర్ ప్లేయర్లైన రోహిత్ శర్మ%–%విరాట్ కోహ్లీతో గంభీర్ మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న వార్తలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. అయితే బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ హాజరవుతారో లేదో ఇంకా స్పష్టత లేదు.

గత సంవత్సరం టీ20ల నుంచి, తాజాగా టెస్టుల నుంచీ రోహిత్, కోహ్లీ వైదొలగడం వెనుక గంభీర్ ప్రభావం ఉందని క్రికెట్ వర్గాల్లో పుకార్లు వినిపించాయి. ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్న ఈ సీనియర్‌లతో గంభీర్ విభేదాలు కారణంగా జట్టు వాతావరణం దెబ్బతింటోందన్న ఆరోపణలు జోరుగా జరుగ్నుతున్నాయి. జట్టు ప్రదర్శనపై దీని ప్రభావం పడుతుందన్న ఆందోళనల నేపథ్యంలోనే బోర్డు ఈ అత్యవసర చర్చకు దిగింది. టెస్టు ఫార్మాట్‌లో గంభీర్ చేపడుతున్న వ్యూహాలు ఫలితాలు ఇవ్వకపోవడం, జట్టు ఆత్మవిశ్వాసం క్షీణించడం వంటి అంశాలపై బీసీసీఐ వివరణ కోరనుంది. గంభీర్‌ను టెస్టు కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలన్న డిమాండ్లు పెరుగుతున్న వేళ ఈ మీటింగ్ మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఈ పరిణామాలపై ఒక బీసీసీఐ ప్రతినిధి మాట్లాడుతూ “స్వదేశ టెస్టుల్లో జట్టు వ్యూహాలు గందరగోళం సృష్టించేలా మారాయి. తదుపరి టెస్టు సిరీస్ ఎనిమిది నెలల తర్వాత మాత్రమే ఉంది. అందువల్ల ముందుగానే స్పష్టమైన ప్రణాళిక అవసరం. వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్, 2027 వన్డే వరల్డ్ కప్ దృష్ట్యా జట్టు అంతర్గత సమస్యలను వెంటనే పరిష్కరించాలి” అన్నారు.




# డిసెంబర్ 19 నుంచి ఓటీటీలోకి ‘నయనం’ వెబ్ సిరీస్

### ఫస్ట్ లుక్ విడుదల... సైకో థ్రిల్లర్‌లో వరుణ్ సందేశ్

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో వచ్చిన తొలి తెలుగు ఓటీటీ వెబ్ సిరీస్ ‘నయనం’ ఈ నెల డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. సైకలాజికల్ థ్రిల్లర్ పంథాలో రూపొందుతున్న ఈ సిరీస్‌కు స్వాతి ప్రకాశ్ దర్శకత్వం వహించారు. మనిషిలోని అసలు స్వభావం, ఆత్మతృప్తి కోసం చేసే ప్రయత్నాల మధ్య ఉండే సున్నిత భావోద్వేగాలను కథగా మలిచినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ సిరీస్‌లో మొత్తం ఆరు ఎపిసోడ్లు ఉండనున్నాయని మేకర్స్ వెల్లడించారు. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది.

ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ,“నటుడిగా నాకు ఇది కొత్త ప్రయాణం. ఇప్పటి వరకు చేయని విభిన్నమైన పాత్రలో ు డాక్టర్ నయన్‌గా ు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ కథలోని మానసిక గాఢత, పాత్రలోని సంక్లిష్టత నాకు కొత్త అనుభవం ఇస్తుంది” అని తెలిపారు. ‘నయనం’ సిరీస్ డిసెంబర్ 19 నుంచి ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.

## నేడు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

అధికార హస్తం పార్టీ తన సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఇటీవలే జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లకు నూతన అధ్యక్షులను నియమించిన నేపథ్యంలో వారితో కలిపి టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆమె సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొని టీపీసీసీ కార్యవర్గానికి, డీసీసీ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేయనున్నారు. జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షులతోపాటు ప్రధాన కార్యదర్శులు, మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మెన్లను ఈ భేటీకి ఆహ్వానించారు. త్వరలో నిర్వహించబోయే పంచాయతీ ఎన్నికలతోపాటు కాంగ్రెస్ రెండేండ్ల పాలన విజయోత్సవాలపై సమాలోచనలు చేయనున్నారు.